

నేటి నుంచి న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

ప్రజల భూ హక్కును కాలరాసే చట్టం అమలును ఖండిస్తూ బుధవారం నుంచి మూడు రోజులు పాటు జిల్లా వ్యాప్తగా న్యాయవాదులంతా విధులు బహిష్కరిస్తున్నట్లు న్యాయ వాదుల సంఘ అధ్యక్షుడు సి హెచ్ దామోదర రామ మోహనరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమలులో తెచ్చిన భూ హక్కు చట్టం హేతుబద్ధంగా లేదని, ప్రజల హక్కులు, భద్రత కోల్పోవడం, రక్షణ కొరవడటం ప్రజలు అన్ని విధాలుగా నష్టపోయే అవకాశం వుండడంతో ప్రజల్లో భాగమైన న్యాయ వాదులు తమ వంతు భాగంగా నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ చట్టంలో లోపాలు, అమలు వలన జరిగే నష్టాల గురించి వివరించే దిశలో సదస్సులు, సమావేశాలు నిర్వహించే కార్యా చరణ చేపడతామని తెలిపారు. దీనికి మీడియా ప్రతినిధులు పాల్గొని తమ వంతు భాగంగా ప్రజల్లో చట్టాలపై అవగాహన చైతన్యం పరిజ్ఞానం కల్పించి సహాయ సహకారాన్ని అందించాలని ఆయన కోరారు.

అంగన్వాడీలకు అండగా తల్లీ పిల్లలు

- జగన్ మామా..ఆయమ్మలకు జీతం పెంచండి..అంటూ చిన్నారుల ప్రదర్శన
- న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం : సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని
- పలుచోట్ల అంగన్వాడీల బిక్షాటన
- బొబ్బిలిలో సచివాలయ సిబ్బంది నిర్బంధం



నిరసన శిబిరంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంగన్వాడీల పోరాటానికి ఆయా కేంద్రాల పరిధిలోని తల్లులు, పిల్లలు మద్దతు పలికారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద కొనసాగిన సమ్మె శిబిరంలో పలువురు తల్లులు తమ పిల్లలతో కలిసి పాల్గొన్నారు. 'జగన్ మామా మా ఆయమ్మకు జీతం పెంచండి' మా టీచర్ల కోర్కెలు తీర్చండి' అంటూ చిన్నారులు పలకలపై రాసి ప్రదర్శించారు. ఈనేపథ్యంలో సమ్మె శిబిరం ప్రజలను ఆకర్షించింది.

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ కంటే ఎక్కువ వేతనం ఇవ్వాలని, అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి 8వ రోజుకు చేరుకుంది. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ నిరసన దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలు 8 రోజులుగా సమ్మె చేస్తుంటే సమస్యలు పరిష్కరించి కేంద్రాలను తెరిపించాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకుండా కవ్వింపు చర్యలకు పాల్పడటం సిగ్గు చేటన్నారు. పేదల పిల్లలకు, గర్భిణులకు అనేక సేవలు అందిస్తున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోగా సచివాలయ ఉద్యోగులు, వెలుగు సిబ్బందితో తెరిపించి పని చేయడం సరికాదని అన్నారు. 8 రోజులు కాదు 80 రోజులైనా సమస్యలు పరిష్కరించేవరకు, వేతనాలు పెంచే వరకు అంగన్వాడీల పోరాటం కొనసాగుతుందని, వారికి సిపిఎం అండగా ఉంటుందని అన్నారు. అనంతరం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం దిగి వచ్చే వరకు పోరాటం ఆగదన్నారు. అధికసంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు అండగా తల్లిదండ్రులు

జామి: అంగన్వాడీలకు తల్లిదండ్రులు మద్దతుగా నిలిచారు. ప్రత్యక్షంగా నిరసన శిబిరాల్లో పాల్గొని, సంఘీభావాన్ని తెలిపారు. అంగన్వాడీ లకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ కంటే ఎక్కువ వేతనం ఇవ్వాలని, సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేస్తున్న పోరాటానికి మద్దతుగా అంగన్వాడీ కేంద్రాల పిల్లలు, వారి తల్లులు పాల్గొన్నారు. సమ్మె పోరాటంలో పాల్గొన్న పిల్లలు, తల్లులు అంగన్వాడీ వర్కర్స్, ఆయాలకు వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కారం చేయాలని, మా టీచర్, ఆయాలతోనే కేంద్రాలను నడిపించాలని కోరుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకులు కనకమహాలక్ష్మి, రామలక్ష్మి, విష్ణుమ్మ, ఆదిలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల బిక్షాటన

అంగన్వాడీల సమ్మె నేపథ్యంలో జామి బస్టాండ్ లో బిక్షాటన చేశారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారిపై ర్యాలీగా ఎంపిడిఒ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు, అధికారులు స్పందించి, రూ.1,780 విరాళాలుగా అందజేశారు. అంగన్వాడీ ఉద్యమానికి పరోక్షంగా సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గాడి అప్పారావు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

రామభద్రపురం : దీక్షా శిబిరం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్, పుర వీధుల్లో ఇంటింటా జోలె, తినే ఆకులు పట్టుకొని బిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. జీతాలు పెంచకపోతే ఆకులు,అలములు తిని బతకాలా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను తీర్చడంలో ప్రభుత్వం మీన మేషాలు లెక్కించడం దారుణమన్నారు.

గజపతినగరం: అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలియజేయాలని గజపతినగరం ఐకెపి కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అనంతరం ఎపిఎం జగదీష్‌కు వినతి పత్రం అందించారు. అంతకుముందు జాతీయ రహదారిపై బిక్షాటన చేశారు. నాయకులు మాట్లాడుతూ తెలంగాణ కన్నా అదనంగా వేతనం ఇస్తామని చెప్పి ఇవ్వకుండా ఈ ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి.లక్ష్మి, అంగన్‌వాడీలు లక్ష్మి, జ్యోతి, సుభాషిని, సన్యాసమ్మ, రాములమ్మ, నారాయణమ్మ, త్రివేణిలు పాల్గొన్నారు.

సమ్మెకు బాలింతలు, గర్భిణుల సంఘీభావం

శృంగవరపుకోట: సమ్మెకు గర్భిణులు, బాలింతలు సంఘీభావం తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్వాడీలకు గ్రాడ్యూటీ ఇవ్వాలని, గత ఆరు నెలల నుండి పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, టిఎ బిల్లులు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యుడు చెలికాని ముత్యాలు, అంగన్వాడి యూనియన్ లీడర్స్ డి శ్యామల, బి మాణిక్యం, సుశీల పాల్గొన్నారు.

మా పిల్లల ఆరోగ్య పరిస్థితి ఏమిటి?

చీపురుపల్లి: అంగన్‌వాడీ సెంటర్లకు తమ పిల్లలను సచివాలయం ఉద్యోగులు పంపించమంటున్నారని, అక్కడ తయారు చేసిన ఆహారం పిలల్లకు పెడితే వారి పరిస్థితి ఏమౌతుందని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి గర్భిణులను, చిన్న పిల్లలను అంగన్‌వాడీ ద్వారా అందించే ఆహారాన్ని తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని అంగన్‌వాడీ టీచర్లు వండితేనే తాము తీసుకుంటామని తెగేసి చెప్పారు. అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్న చోటకి వెళ్లి తామంతా అంగన్‌వాడీల వెంటే ఉంటామని పిల్లల తల్లిదండ్రులు చెప్పారు.



చీపురుపల్లిలో అంగన్వాడీల నిరసనలో తమ పిల్లలతో కలిసి పాల్గొన్న తల్లులు;



గజపతినగరంలో బిక్షాటన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

సచివాలయ ఉద్యోగుల నిర్బంధం

బొబ్బిలి : బొబ్బిలిలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టి అంగన్వాడీ కేంద్రాలను సచివాలయ ఉద్యోగులు స్వాధీనం చేసుకోవడంతో అంగన్వాడీలు ఆగ్రహించి గొల్లపల్లిలో సచివాలయ ఉద్యోగులను అంగన్వాడీ కేంద్రంలో అంగన్‌వాడీలు, చిన్నారుల తల్లులు నిర్బంధించి నిరసన తెలిపారు. జంగాలవీధి, సింగారపువీధి, పాతబొబ్బిలిలో అంగన్వాడీ కేంద్రాల నుంచి సచివాలయ ఉద్యోగులను బయటకు నెట్టివేసి అంగన్వాడీ కేంద్రాలకు తాళాలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఉమాగౌరి, దేవి, అనురాధ, శ్రీదేవి, కామేశ్వరి, రాజీ, పార్వతి మాట్లాడుతూ అంగన్వాడీలను రెగ్యులర్ చేసి కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు.



అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న కార్యకర్తలు, తల్లులు



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు

రూ.158.75 కోట్లతో బడ్జెట్‌కు ఆమోదం

నగరాభివృద్ధే లక్ష్యం : మేయర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

నగర పాలక సంస్థ కౌన్సిల్ రూ.158.75 కోట్ల తో 20024-25కు బడ్జెట్ ను ప్రవేశపెట్టి ఆమోదించింది. మంగళవారం నగర పాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సుమారు రూ.81.47 కోట్లతో నగర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. ముఖ్యంగా రూ.12 కోట్ల సాధారణ నిధులతో కొత్తగా రహదారుల నిర్మాణం, రూ5కోట్ల బిపిఎస్ నిధులతో అభివృద్ధి పనులు, రూ.12 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు, రూ.1కోటితో సచివాలయాల పక్కా భవనాల నిర్మాణం చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదించింది. రూ.2కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం, రూ.1.50 కోట్లతో హార్టికల్చర్, పట్టణ సుందరీకరణ, రూ.6 కోట్ల సాధారణ నిధులుతో మురుగు కాలువలు, కల్వర్టుల నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రూ.1.50 కోట్లతో సెంట్రల్ లైటింగ్, పార్కుల లైటింగ్, రూ.1.50 కోట్లతో పార్క్స్ అండ్ ప్లే గ్రౌండ్స్ అభివృద్ధి పనులు, 80 లక్షలతో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం, రూ.2.50 కోట్లతో నీటి సరఫరా పైపు లైన్ల నిర్మాణం చేపట్టాలని తీర్మానించారు. అనంతరం జరిగిన అత్యవసర కౌన్సిల్ సమావేశంలో ఆరు అంశాలతో కూడిన అజెండాలో మూడింటిని ఆమోదించి, మూడు అంశాలను వాయిదా వేశారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు లయా యాదవ్, కోలగట్ల శ్రావణి, కమిషనర్ శ్రీరాములు నాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, ఫ్లోర్ లీడర్ రాజేష్ కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

21న ఓటర్ల జాబితా పరిశీలకులు రాక

కలెక్టరేట్‌లో ప్రజలు కలిసేందుకు అవకాశం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు, సీనియర్ ఐఎఎస్ అధికారి జె.శ్యామలరావు ఈనెల 21న గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆరోజు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం వరకు జిల్లా పరిశీలకులు కలెక్టర్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, ఓటర్ల జాబితా విషయమై విన్నవించదలచుకున్న ప్రజలు వారిని కలవవచ్చని జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.డి.అనిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక సమ్మరీ రివిజన్-2024లో భాగంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వారి ఆదేశాల మేరకు విజయనగరం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముసాయిదా ఓటర్ల జాబితాను అక్టోబరు 27న ప్రచురించామన్నారు. ఈ జాబితాను జిల్లాలో గల అన్ని రాజకీయ పార్టీలకు సరఫరా చేశామని, ఈ జాబితాకు సంబంధించి అక్టోబరు 27 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించామని తెలిపారు.





మృతి చెందిన తల్లి మహి, కుమారుడు దేవాన్ష్

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

తల్లీ కుమారుడు మృతి

తండ్రికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

హైదరాబాద్ సంగారెడ్డిలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొబ్బిలి మండలం దిబ్బగుడివలస గ్రామానికి చెందిన తల్లీ కుమారుడు దుర్మరణం చెందగా తండ్రి తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు మేరకు.. దిబ్బగుడివలసకు చెందిన కొట్నాన సత్యనారాయణ, భార్య మహితో కలిసి జీవనం సాగిస్తున్నారు. సత్యనారాయణ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. ముగ్గురు కలిసి మంగళవారం ఉదయం ఆలయానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా సంగారెడ్డి వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో తల్లి మహి, కుమారుడు దేవాన్ష్ అక్కడికక్కడే మృతి చెందారు. సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు గాయపడిన సత్యనారాయణను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా మరణించిన మహి, దేవాన్ష్ మతదేహాలకు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి అంత్యక్రియలు కోసం స్వగ్రామం దిబ్బగుడివలస తీసుకువస్తున్నారు. తల్లీ కుమారుడు మతితో దిబ్బగుడివలసలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అట్టహాసంగా రాష్ట్ర మహిళా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి సౌజన్యంతో, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర మహిళ కబడ్డీ పోటీలు ను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ప్రారంభించారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఈ పోటీలు స్థానిక మహిళా పార్కు వేదికగా జరుగుతున్నాయి. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అందులో బాగంగా ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. క్రీడల ద్వారా మంచి భవిష్యత్ ఉందని, బాగా ఆడి క్రీడా స్ఫూర్తిని నింపాలని అన్నారు. రాష్ట్ర పోటీలకు 8 జిల్లాల నుంచి జట్లు పాల్గొన్నాయి. డిప్యూటీ మేయర్ శ్రావణి మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర మహిళ కబడ్డీ పోటీలు నిర్వహించడం ఇదే తొలిసారన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటి మేయర్ లయా యాదవ్ నగర మహిళా కార్పొరేటర్లు పాల్గొన్నారు.



సభ ప్రాంగణంలో కూర్చునేందుకు వేసిన కుర్చీలు;



ఏర్పాట్లపై నాయకులతో చర్చిస్తున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు

నేడు యువగళం బహిరంగ సభ

- ఉత్సాహంలో తెలుగు తమ్ముళ్లు
- ముందే చేరుకున్న లోకేష్, బ్రాహ్మిణి, భువనేశ్వరి
- ఏర్పాట్లను పరిశీలించిన టిడిపి, జనసేన నాయకులు
- 5లక్షల మంది వస్తారని అంచనా
- 600 మంది కూర్చునేందుకు వీలుగా భారీ వేదిక

ప్రజాశక్తి- భోగాపురం

టిడిపి యువనేత, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం-నవశకం పాదయాత్ర విజయోత్సవ సభ భోగాపురం మండలం పోలిపల్లి వద్ద గల భూమాతా లేఅవుట్‌లో బుధవారం జరగనుంది. ఈ సభకు టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సహా టిడిపి కీలక నేతలు, అన్ని నియోజక వర్గాలకు చెందిన పార్టీ ఇన్‌ఛార్జులు హాజరు కానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. గత వారం రోజులుగా సభా వేదిక, బారికేడ్లు ఏర్పాటు చకా చకా జరిగాయి. గత రెండురోజులుగా టిడిపి ముఖ్య నాయకులంతా ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు. రాష్ట్రంలో వివిధ హోదాల్లో ఉన్న తెలుగుదేశం, జనసేనకు చెందిన పార్టీ నాయకులు పెద్ద ఎత్తున మంగళవారం సభా వేదిక వద్దకు వచ్చారు. నారా లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మిణి, చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఇప్పటికే చేరుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు, బుచ్చయ్య చౌదరి, అలాగే నాయకులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, పట్టాభి, బుద్దా వెంకన్న, చింతకాయల అయ్యన్న పాత్రుడు, పీతల సుజాత, దేవినేని ఉమా, కొల్లి రవీంద్ర, ఉగ్రనరసింహారెడ్డి, వర్ల రామయ్య, బాబు రాజేంద్రప్రసాద్ దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు విలేకర్లతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఇంటికి వెళ్ళేందుకు సిద్ధంగా ఉందని, మరో వంద రోజుల్లో టిడిపి అధికారంలోకి రానుందని అన్నారు. యువగళం సభ నిర్వహించేందుకు వైసిపి ప్రభుత్వం అన్ని విధాలా ఆటంకాలు కలిగించిందన్నారు. సభా స్థలంతో పాటు, బస్సులు ఇచ్చేందుకు కూడా నిరాకరించిందని తెలిపారు. వైసిపిని ప్రజలు ఇంటికి సాగనంపేందుకు సిద్దమయ్యా రని అన్నారు. అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం నడవడం లేదని అన్నారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కూడా హాజరవుతుండడంతో ఆ పార్టీకి చెందిన నాయకులు పంచకర్ల సందీప్, కోన తాతారావు, పాలవలస యశస్వని, పడాల అరుణ, లోకం మాధవి తదితరులు సభా ప్రాంగణం వద్దకు వచ్చిఏర్పాట్లను పరిశీలించారు. సభకు 5లక్షల మంది వస్తారని అంచనా కాగా, సుమారు లక్షమందికి కూర్చోనేందుకు కుర్చీలు వేస్తున్నారు. ట్రాఫిక్‌కి ఇబ్బంది లేకుండా పార్కింగ్ ఏరియాలను కూడా జిల్లాల వారీగా ఏర్పాటు చేశారు.

కుటుంబ సభ్యులతో సన్ రే రిసార్ట్‌కు చేరుకున్న లోకేష్

కుటుంబ సభ్యులతో కలిసి నారా లోకేష్ సన్ రే రిసార్ట్ కు శనివారం రాత్రి చేరుకున్నారు. విశాఖలో మంగళవారంరాత్రి యువగలం పాదయాత్ర ముగిసిన విషయం తెలిసిందే. అనంతరం ఆయన తల్లి భువనేశ్వరి, భార్య బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్‌తో కలిసి చేరుకున్నారు. బుధవారం జరిగే ముగింపు సభలో పాల్గొంటారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ ఆయనను కలిసి సాలువ కప్పి సన్మానించారు



సన్‌రే రిసార్ట్‌లో లోకేష్‌ను కలిసిన కర్రోతు సత్యనారాయణ

అంగన్‌వాడీ పిల్లలకు వండి పెట్టలేం

డిఇఒకు తెలిపిన ఎండిఎం కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంగన్వాడీ కేంద్రాలు పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వంటలు చేసి పెట్టాలని అధికారులు ఆదేశాలు ఇస్తున్నారని, తాము అంగన్వాడీల పోరాటానికి మద్దతు ఇస్తున్నందున వంటలు చేసి పెట్టలేమని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకులు డిఇఒ బి.లింగేశ్వర రెడ్డికి తెలిపారు. మంగళవారం డిఇఒకు ఆ సంఘం నాయకులు బి.సుధారాణి, రామలక్ష్మి, సత్యవతి వినతిపత్రం అందజేశారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ సోమవారం నుంచి అంగన్వాడీ పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో స్కూల్లో వంట చేయాలని అధికారులు చెప్పారని, అయితే తామంతా అంగన్‌వాడీల సమ్మెకు మద్దతిస్తున్నామని తెలిపారు. అందువల్ల తాము పిల్లలకు వండి పెట్టలేమి తేల్చి చెప్పారు.

అంగన్వాడీలకు ఎండిఎం కార్మికుల మద్దతు

గంట్యాడ: అంగనవాడీ కార్యకర్తల సమ్మెకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు మద్దతు తెలిపారు. అంగన్వాడీ పిల్లలకు తాము వంట చేసి పెట్టమని ఎంఇఒ వెంకటరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పి. సత్యవతి, ఎస్ పార్వతి, ఏ దేవి, ఆర్ సత్యవతి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. మంగళవారం లంకపట్నంలోని నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని ఆయన ప్రారంభించారు. 19వ డివిజన్ కార్పొరేటర్ పొట్నూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. వైసిపి నగర అధ్యక్షులు ఆసపు వేణు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోలగట్ల మాట్లాడారు. నాలుగున్నర ఏళ్లుగా నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకుని వారి అవసరాలను తీర్చడమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. జొన్న గుడ్డి, లంకా పట్నం తనకు రెండు కళ్ళు లాంటివని పేర్కొన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కళ్యాణ మండపానికి అంబేద్కర్ సామాజిక భవనంగా నామకరణం చేసేందుకు కౌన్సిల్ ఆమోదం కోరనున్నామని చెప్పారు. రెల్లి కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రావు మాట్లాడుతూ చట్టసభలలో తమ వర్గానికి ప్రాతినిధ్యం వహించే విధంగా అందరూ కృషి చేయాలని అన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాములునాయుడు, ఇన్‌చార్జి ఇఇ దక్షిణామూర్తి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, పట్నాన పైడిరాజు, పొట్నూరు వెంకటరాజు, పద్మ, బొంగ భానుమూర్తి, ఆర్జి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. నగరంలో వివిధ డివిజన్లలో రూ.80లక్షలతో అభివృద్ధి పనులకు మేయరు వి.విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

డెంకాడ: డెంకాడ, పూసపాటిరేగ మండలాల్లో వివిధ రోగాలతో బాధపడుతున్న ముగ్గురుకు ఎమ్మెల్యే మంగళవారం తన నివాసంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. డెంకాడ మండలంలోని బేతనపల్లికి చెందిన ఆవాల గిరీష్ మెదడులో నీరు చేరడంతో అరుదైన వ్యాధితో బాధపడుతున్నారు. ఇతనకు ప్రభుత్వం నుంచి వచ్చిన రూ. 1.70లక్షల చెక్కును ఎమ్మెల్యే అందించారు. ఇదే మండలంలోని బంగార్రాజుపేటకు చెందిన బంగారు రాంబాబు రోడ్డు ప్రమాదంలో తలకు గాయమై మెదడుకు ఆపరేషన్ చేయించుకున్న నేపథ్యంలో ఆయనకు రూ. 3.50లక్షలు చెక్కును, పూసపాటిరేగ మండలంలో కుమిలి గ్రామానికి చెందిన సమిరె రామకృష్ణకు రూ. 80వేలు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, మాజీ సర్పంచ్ కరుమజ్జి త్రినాథ్, బంగార్రాజు నాయకులు సాధి ఈశ్వరరావు, ఎంపిటిసి పొంతపల్లి జగన్నాధరావు, జెసిఎస్ మండల కన్వీనర్ సారిక గౌరి తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిని డిఎంహెచ్‌ఒ తనిఖీ

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట పిహెచ్‌సిలో జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి ఎస్. భాస్కరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు రికార్డులు, ల్యాబ్, మందుల గది, ఇమ్యూనైజేషన్ గది పరిశీలించారు. జగనన్న సురక్ష రిఫరల్ క్లియర్ చేయాలని తెలిపారు. వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ యాప్ డౌన్లోడ్ చేయించి ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎమ్, ఆశ వర్కర్స్ క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 27 నుండి జనవరి 12 వరకు కుష్టు వ్యాధి పై సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. నిర్మాణంలో ఉన్న పిహెచ్‌సి భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ సింహాద్రి నాయుడు, యుడిసి సురేష్ కుమార్, సూపర్ వైజర్స్ జగదాంబ, పద్మావతి, నరసింహరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ కాలం పొడిగింపు

నెల్లిమర్ల: ఆర్‌టిసి జోనల్ ఛైర్‌పర్సన్‌గా గదల బంగారమ్మ పదవీ కాలం పొడిగిస్తున్నట్లు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమెను మంగళవారం సచివాలయం సిబ్బంది అభినందించారు. ఆమె మాట్లాడుతూ అందరి ఆదరాభిమానాలతో ఈ రెండు సంవత్సరాల కాలంలో జోన్‌లో ఉన్న 19 డిపోలను నిరాడంబరంగా సందర్శించి అభివృద్ధికి కృషి చేశామన్నారు. పాడేరు బస్సు ప్రమాద ఘటనలో క్షతగాత్రులను పరామర్శించి భరోసా ఇచ్చి అండగా నిలిచామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం డిడిఒ వై.రమణ, వ్యక్తిగత కార్యదర్శి ఎం.సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

యువగళం ముగింపు సభను జయప్రదం చేయాలి

నెల్లిమర్ల: యువగళం విజయోత్సవ సభ జయప్రదం చేయాలని టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్ పిలుపునిచ్చారు. మంగళ వారం మండలంలో పలు గ్రామాల్లో టిడిపి నాయకులు పర్యటించి విజయోత్సవ సభ జయప్రదం చేయాలని కోరుతూ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న నారా లోకేష్‌బాబు యువగళం విజయోత్సవ సభ జరుగుతుందని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయ ప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, రాష్ట్ర ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, మండల తెలుగు యువత అధ్యక్షులు నల్లం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కోట: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర ముగింపు సభను కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే మీసాల గీత కోరారు. మంగళవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ బుధవారం భోగాపురం భూమాత లేఅవుట్‌లో ఈసభ జరుగు తుందన్నారు.

విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు మండలంలోని గుంకలాం లో సభ విజయవంతానికి ప్రచారం చేశారు. కార్యకర్తలకు పార్టీ జెండాలను అందించి సభకు వెళ్లేందుకు సన్నద్ధం చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

బొబ్బిలి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని రావువారివీధి, శివాలయం, పల్లివీధి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, కాలువలలో చెత్త వేయకుండా పరిసరాలను పరిశు భ్రంగా ఉంచాలన్నారు. ఇళ్లల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలన్నారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లు, కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆయనతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, పారిశుధ్య విభాగ సిబ్బంది ఉన్నారు.

జగన్‌తోనే సంక్షేమం సాధ్యం

బొబ్బిలి: రాష్ట్రంలో జగన్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని 27వ వార్డులో మంగళవారం రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, జెసిఎస్ కన్వీనర్ రెజేటి విస్సు, కౌన్సిలర్ ఒమ్మి లక్ష్మి, ఒమ్మి రామారావు, పాల్గొన్నారు.

జిఎంఆర్ ఫౌండేషన్‌ను సందర్శించిన కలెక్టర్

రాజాం: రాజాంలో నాబార్డు సహకారంతో జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను జిల్లా కలెక్టరు నాగలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ సంస్థలో జరుగుతున్న కార్యక్రమాలకు సంబంధించి ఉన్న మౌలిక వసతులు, శిక్షణ అందించే వివిధ సంస్థల సాంకేతిక సాంకేతిక సంస్థల సహకారం గురించి జిఎంఆర్ ప్రతినిధులు కలెక్టరుకు వివరించారు. నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతి యువకులతో కలెక్టరు ముచ్చటించారు. ఈ సందర్భంగా నాబార్డు ఆర్థిక సహకారంతో ఎస్‌ఎఆర్‌ఇడిలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ లాబ్ ను, మహిళల కోసం ఏర్పాటు చేసిన హోం హెల్త్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి టూల్ కిట్లు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాబార్డు డిడిఎం నాగార్జున, ఎల్‌డిఎం శ్రీనివాసరావు, యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ నరేష్, వరలక్ష్మి ఫౌండేషన్ జిఎం జయకుమార్, రైడ్ డైరెక్టర్ రాజేష్, ఎపిఎం నాగరాజు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాల గొంతు సాబ్జీ

రాజాం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పోరాటాలకు తీరని లోటని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు అన్నారు. రాజాంలోని అంగన్‌వాడీ సమ్మె శిబిరంలో సాబ్జీ సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీగా సాబ్జీ అనేక ఉద్యమాలకు అండగా నిలిచారన్నారు. ఆయన మృతి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాతంత్ర పోరాటాలకు తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో ఉమా కుమారి, సునీత, జయలక్ష్మి, పుణ్యవతి, వనజ, భారతి తదితరులు పాల్గొన్నారు

ఘనంగా సిటీ క్రిస్టమస్ వేడుకలు


విజయనగరం కోట: విజయనగరంలోని సిమ్స్ బాప్టిస్టు చర్చిలో సిటీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరి సహస్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, కొవ్వొత్తులు వెలిగించి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సహస్ర మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ జాన్, డాక్టర్ వై. ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రామదుల చెరువుపై రాబందులు

● దర్జాగా కబ్జా చేస్తున్న అక్రమార్కులు ● రెవెన్యూ రికార్డుల స్కెచ్‌లో చెరువు ●ఎఫ్‌సిఒలో జిరాయితీగా చిత్రీకరణ ● రెవెన్యూ అధికారుల లీలలు

ప్రజాశక్తి - గుర్ల

కబ్జాదారుల అక్రమాలు రోజు రోజుకూ పెచ్చుమీరుపోతున్నాయి. ఎక్కడ ప్రభుత్వ భూములు, కొండపోరం బోకు భూములు, డీ పట్టా భూములు కనిపించినా వెంటనే పాగా వేసేస్తున్నారు. పై పెచ్చు తమకు మంత్రి తెలుసు, జిల్లా పరిషత్తు చైర్మన్ తెలుసు, ఉన్నతాధికారులు తెలుసు అని బెదిరించి దోచుకుంటున్నారు. ప్రభుత్వ భూములు అయిపోయాయేమో ఇప్పుడు ఏకంగా చెరువులపైనే పడ్డారు. ఇష్టానుసారంగా చెరువులను కబ్జా చేసి లే అవుట్లగా మార్చుకుంటున్నారు. దీనికి రెవెన్యూ అధికారులు, స్థానిక నాయకులు వత్తాసు పలకడంతో కబ్జాదారుల ఆగడాలు మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగిపోతుంది.


చెరువుగా చూపిస్తున్న రెవెన్యూ స్కెచ్

మండలంలో గూడెం రెవెన్యూ పరిధిలో గల రామదుల చెరువును దర్జాగా కబ్జా చేస్తున్నా ఎవరూ పట్టించికోవడం లేదని గ్రామస్తులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు కింద సుమారు 20 ఎకరాలు భూమిని రైతులు సాగుచేస్తున్నారు. ఈ చెరువు నుంచి వచ్చిన సాగునీటిపైనే ఈ భూములన్నీ ఆధారపడి ఉన్నాయి. ఇటువంటి చెరువుపై కొంత మంది అక్రమార్కులు కన్నేశారు. స్థానిక రెవెన్యూ సిబ్బందిని చేతులో పెట్టుకొని కబ్జా వ్యహారం నడిపిస్తున్నారని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన నేతలు రామదుల చెరువుకు ఆనుకొని కొంత భూమిని కొనుగోలు చేశారు. చెరువును పూడ్చి వేస్తే మొత్తం భూమి అంతా తమ ఆధీనంలోకి వస్తుందని నిర్ణయించుకున్నారు. దీంతో పక్కనే ఉన్న రామదుల చెరువును తమ బినామిలా పేరు మీద రికార్డుల్లోకి నమోదు చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. సర్వే నెంబర్ 189-2లో 3.26 ఎకరాల విస్తీర్ణం గల రామదుల చెరువును రెవెన్యూ రికార్డుల స్కెచ్‌లో రామదుల చెరువు అని ఉండగా, ఎఫ్‌సిఒలో జిరాయితి అనీ ఉండడంతో రెవెన్యూ లీలలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఈ చెరువు అభివృద్ధి కోసం ఉపాధిహామ పథకంలో నిధులు మంజూరు చేసి పనులు చేపట్టినట్టు స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ సిబ్బంది అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా పని చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎటువంటి అనుమతులూ లేకపోయినా

వాల్టా చట్టం ప్రకారం చెరువును కప్పడానికి రెవెన్యూ అధికారుల నుండి అనుమతులు తీసికోవలసి ఉంది. వాల్టా చట్టం ప్రకారం చెరువులను సంరక్షించ వలసిన రెవెన్యూ సిబ్బంది, అధికార పార్టీ నాయకులు వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. ఎటువంటి అనుమతులూ లేకుండానే దర్జాగా చెరువును కప్పేస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి.


జెసిబిలతో చెరువును చదును చేస్తున్న కబ్జాదారులు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

గూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 189-2లో ఉన్న 3.26 ఎకరాలు భూమి స్కెచ్‌లో రామదుల చెరువుగా ఉంది. ఎఫ్‌సిఒ, ఎండిఆర్‌లో జిరాయితీగా ఉంది. ఈ విషయాన్ని పై అధికారులకు తెలియచెసి వారి ఆదేశాలు ప్రకారం చర్యలు తీసుకుంటామం.

పద్మావతి, తహశీల్దార్, గుర్ల

ఆరోగ్యశ్రీతో కార్పొరేట్ వైద్యం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని మంగళవారం ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచినట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైస్ చైర్మన్ చెలికాని మురళి, వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, జెసిఎస్ కన్వీనర్ విస్సు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు

బాడంగి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టుందని జెడ్‌పిటిసి రామారావు, ఎంపిపి సలహాదారు తెంటు మధుసూదన్ అన్నారు. మంగళవారం పిన్నవలస సచివాలయంలో నిర్వహించిన ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.



బొబ్బిలి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు

పేద రోగులకు సంబంధించి వ్యయ పరిమితి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఈ పథకం ద్వారా గతంలో కుటుంబానికి ఏడాదికి రూ.5 లక్షల వరకు చికిత్స చేసేవారని దాన్ని ఇప్పుడు రూ. 25లక్షలు వరకూ పెంచారని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం పై ప్రజలకు ఎలాంటి సందేహాలూ లేకుండా ఇంటింటికి ప్రచారం చేసి ఆరోగ్యశ్రీ యాప్ డౌన్లోడ్ చేసుకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తెంటు తిరుపతి నాయుడు, ఎంపిడిఒ ఆంజినేయులు, వైద్యలు, సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు

ఆరోగ్య శ్రీకార్డులు పంపిణీ

డెంకాడ: రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పరిమితి రూ.10 లక్షల నుండి రూ. 25 లక్షల వరకు పెంచిన నేపథ్యంలో మోపాడ పిహెచ్‌సిలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేతులు మీదుగా మంగళవారం నూతన ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం నెల్లిమర్ల నగర పంచాయతీలో కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: వైసిపి ప్రభుత్వం పేదల ఆరోగ్యం, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక సచివాలయంలో ఆరోగ్యశ్రీ రూ.25 లక్షల పథకాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేశ్ బాబు ప్రారంభించి కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాస రావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా సతీష్, పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం ఆరోగ్యశ్రీ కార్డులను జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో



నెల్లిమర్ల: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

ఎంపిడిఒ బిఎస్‌కేఎన్ పట్నాయక్, పిహెచ్‌సి వైద్యాధికారి ఏ ధరణి, కాలేజీ ప్రిన్సిపల్ కే అప్పారావు, సి హెచ్‌ఓ ఆంజనేయులు, దంగేటి సత్యనారాయణ ఎమ్మెల్ హెచ్‌పి కోమలి, వైద్య సిబ్బంది ముత్యాలమ్మ, వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

చీపురుపల్లి: దేశంలోనే అత్యుత్తమ పథకం ఆరోగ్యశ్రీ అని ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ, వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాస నాయుడు అన్నారు. నూతనంగా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కర్రోతు రమణ, కొనిరెడ్డి రమణ, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

వంగర: ప్రభుత్వం పేదలకు ఐదు లక్షల నుండి 25 లక్షలకు పెంచుతూ విడుదల చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను ఎంపిపి ఉత్తరా వెల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి మండల అధ్యక్షులు కరణం సుదర్శన్ రావు చేతుల మీదుగా స్థానిక మండల కేంద్రం సచివాలయం వద్ద మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వంగర వైద్య అధికారి సుస్మిత దయానా, హెచ్‌డి తవిటమ్మ, వైసిపి నాయకులు కనగల పారినాయుడు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: పేద కుటుంబాలకు ఆరోగ్యశ్రీ పెంపు ఒక వరం అని ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు తెలిపారు. పెంచిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక సచివాలయంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమామణి, స్థానిక వైద్యాధికారి పిల్లి దిలీప్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ వాసుదేవరావు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కోరాడపేట రామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు న్యాయం చేయాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కోరాడ పేట గ్రామాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. పునరావాస ప్యాకేజీ పూర్తి స్థాయిలో ఇవ్వకుండా ప్రాజెక్టు పనులు చేయడం దుర్మార్గమన్నారు. ముఖ్యంగా నిర్వాసితుల జిరాయితీ భూములు అధికార్ల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ భూమిగా తప్పుగా గుర్తించబడిందన్నారు. దీనివల్ల రైతులు భూములు కోల్పోవడమే కాకుండా వారికి రావాల్సిన పరిహారం అందడంలేదన్నారు. పునరావాస ప్యాకేజీ కింద నిర్వాసితులుంటున్న ఇళ్లకు ఇంతవరకు ప్రభుత్వం పరిహారం చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. జిరాయితీ భూములు కోల్పోయిన రైతులు అధికార్ల చుట్టూ తిరిగినా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కాగా 18 సంవత్సరాలు నిండిన నిర్వాసితులు గ్రామాలకు చెందిన యువతీ యువకులకు పరిహారం చెల్లించాలని చట్టం చెబుతున్నా అమలు


నిర్వాసితులతో మాట్లాడుతున్న రామారావు

చేయకపోవడం దారుణమన్నారు. నిర్వాసితులకు జిరాయితీ భూముల హక్కులు కల్పించి వాటికి నష్ట పరిహారం చెల్లించడంతో బాటు పునరావాసానికి ఇళ్లు, యువతి యువకులకు పరిహారం చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలకాని పక్షంలో రైతు సంఘం తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నిర్వాసితులు పాల్గొన్నారు.

వికలాంగులకు చేయూత అందించండి

ప్రజాశక్తి- కొత్తవలస

వికలాంగులకు చేయూతని అందించడం మన బాధ్యత అని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం శ్రీగురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో వికలాంగులకు ఉపకరణాలు అందించే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు మౌలిక వసతులు కల్పించడానికి విద్య ఉద్యోగాలలో రిజర్వేషన్ శాతం పెంచారని, పింఛన్ సౌకర్యం కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఉపకరణాలకు తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు. వికలాంగులకు దేవతామూర్తులుగా చూడాలని వీరికి మనోధైర్యం కల్పించి సమాజంలో అన్ని రంగాలలో ప్రముఖ స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస మండల అధ్యక్షులు నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ,


ఉపకరణాల పంపిణీను ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్

కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, తుమ్మకాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు, డిఎం అండ్ హెచ్‌ఒ భాస్కం౦రావు, ప్రభుత్వ వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి జగదీశ్వరరావు, శ్వేత, గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ అధినేత జగదీష్ బాబు, డాక్టర్ మణికంఠ, డాక్టర్ గణపతి, అధిక సంఖ్యలో ప్రభుత్వ అధికారులు స్థానిక నేతలు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక మండల రిసోర్స్ కార్యాలయంలో సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న ఉద్యోగ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ మంగళవారం గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రం అందించారు. సమగ్ర శిక్షా జెఎసి పిలుపుమేరకు మూడు రోజులుగా పెండౌన్ కార్యక్రమంలో భాగంగా గాంధీ, అంబేద్కర్ విగ్రహం తదితర నాయకులకు వినతిపత్రం అందించారు. సమస్యలు పరిష్కరించకుంటె ధర్నాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో మండల జెఎసి అధ్యక్షులు పొన్నాడ అప్పలనాయుడు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సిఆర్‌పిలు చంద్రరావు, మోహన్మిరావుతో పాటు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొన్నారు.

వేపాడ : మండల కేంద్రంలోని మండల విద్యా


వేపాడ: నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

వనరుల శాఖ కార్యాలయం వద్ద అవుట్ సోర్సింగ్ సిబ్బంది మంగళశారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని వేతనంతో కూడిన సెలవులను మంజూరు చేయాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, మెడికల్ లీవ్‌లు మంజూరు చేయాలని నినాదాలు చేస్తూ పెన్‌డౌన్ చేశారు.

జగనన్నతోనే గ్రామ స్వరాజ్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - లక్కవరపుకోట

జగనన్నతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మల్లివీడు గ్రామంలో మంగళవారం సచివాలయం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం పల్లె ప్రజలకు అందించాలనే సంకల్పంతో జగనన్న సచివాలయ వ్యవస్థను స్థాపించారన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయ భవనాన్ని నిర్మించి వాలంటీర్ వ్యవస్థ ద్వార అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా కులం, మతం, పార్టీతో సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక భుత్వం అని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో అందుకు తగ్గట్టు పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి వరలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యన్నారాయణ, జేసీఎస్ ఇంచార్జి యడ్ల కిషోర్, వైస్ ఎంపిపిలు ఆవాల శ్యామల, శ్రీను రాజు, ఆర్.జి. పేట కిష్టప్పదొర, గేదెల నరసింహనాయుడు, ఆవాల సత్యన్నారాయణ, మల్లివీడు సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున్, పెదిరెడ్ల వెంకటేష్, జి.హరిప్రసాద్, జెడికె అప్పలరాజు, ప్రసాద్, బెహరా కిరణ్ కుమార్, కె.కృష్ణ పాల్గొన్నారు.

లక్కవరపుకోట: మండలంలోని గొల్జాంలో నాటు తుపాకులు తయారు చేస్తున్న ముసిరాన కన్నబాబు అనే వ్యక్తిని మంగళవారం లక్కవరపుకోట ఎస్ఎం ముకుందరావు తన సిబ్బందితో వెళ్లి అరెస్ట్ చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోల్జాం గ్రామంలో నాటు తుపాకులు తయారు చేస్తున్నారన్న సమాచారంతో దాడి చేయగా నాటు తుపాకులు పట్టుబడ్డాయని వాటిని స్వాధీనం చేసుకుని ముసిరాన కన్నబాబు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

విజయనగరం: గంజాయి తరలిస్తున్న నలుగురు ముఠాను పట్టుకుని అరెస్టు చేసినట్లు టూ టౌన్ సిఐ ఎన్‌హెచ్ విజయనంద్ తెలిపారు. ఇతర రాష్ట్రాలకు గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ జి రాజేష్ సిబ్బందితో కలిసి విజయనగరం గిరిజన యూనివర్సిటీ దగ్గరకు మంగళవారం వెళ్లి తనిఖీ చేయగా అక్కడ నలుగురు వ్యక్తులు గంజాయిని అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డారని తెలిపారు. విజయనగరానికి చెందిన పసల రాజేష్, మానాపురం గ్రామానికి చెందిన సమ్రోతు గణేష్, ఒరిస్సా రాష్ట్రం సిమిలిగూడకు చెందిన అమిత్ కోస్లా, నౌచిన్ కోస్లాలపై కేసు నమోదు చేశామన్నారు. వీరు గంజాయిని ఇక్కడ కొనుగోలు చేసి హైదరాబాదుకు తరలిస్తున్నారని చెప్పారు. వీరి వద్ద నుంచి 5 కేజీల గంజాయి, 4 మొబైల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్, రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు.

ట్రైలర్ విడుదల

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఫ్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిరంజన్ రెడ్డి నిర్మించిన ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన హనుమాన్ చిత్రం ట్రైలర్‌ను మంగళవారం ఎన్‌సిఎస్ సినిమా థియేటర్‌లో మేనేజింగ్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాస్ విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల వారిని ఈ చిత్రం ఆకట్టుకుంటుందని అన్నారు. అనుదీప్ దేవ్, హరిగౌర, కృష్ణసౌరభ్ చక్కటి సంగీతాన్ని అందించారని, దాశరథి శివేంద్ర అద్భుతమైన సినిమాటోగ్రఫీ చేసారని తెలిపారు. జనవరి 12న విడుదలయ్యే ఈ చిత్రంలో తేజ సజ్జ, అమృత అయ్యర్, వరలక్ష్మీ శరత్‌కుమార్, వినయ్‌రాయ్ ప్రధాన పాత్రలు పోషించారని అన్నారు.